రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.31 గం.
సహర్ : శనివారం ఉ: 5.02 గం.

మొక్కుబడిగా..


రాజంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో అసంపూర్తిగా బాత్‌రూమ్ పనులు

- సర్కారు స్కూళ్లలో కార్పొరేట్ స్థాయి సౌకర్యాల కల్పన మిథ్యేనా?
- రెండేళ్లు గడిచినా తొలి విడతకే దిక్కులేదు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో పథకం గతేంటో?

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 14 : గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమం మొక్కుబడిగానే మారింది. అప్పటి ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభినప్పటికీ అమలులో చిత్తశుద్ధి కనబరచలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎంపికైన పాఠశాలలకు నిధులు సకాలంలో వస్తాయో రావో అన్న మీమాంసతో ఈ పథకం మొక్కు'బడి'గా మారింది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయి స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం కాగితాలకే పరిమితమైంది. రెండేళ్ల కిందట ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో ఎంపిక చేసిన తొలి విడత ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కోట్ల రూపాయలు ఖర్చు చేసి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించినట్లే కనిపిస్తుంది.

రెండేళ్ల క్రితం ప్రారంభం

జనవరిలో 2022 అప్పటి ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మూడేళ్లలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే సంగారెడ్డి జిల్లాలో తొలి విడతగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. పాఠశాలల్లో తరగతి గదులు, ప్రహరీ, వంట గది, డైనింగ్‌హాలుతో పాటు లైబ్రరీ, లేబరేటరీ, టాయిలెట్లు, తాగునీటి వసతి, విద్యుత్తు తదితర కనీస వసతులను కల్పించాల్సి ఉన్నది. ఇందు కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూర్చడంతో పాటు దాతల నుంచి విరాళాలు సేకరించాలని కూడా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

సంగారెడ్డి జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన 1262 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో తొలి విడతగా 441 ప్రభుత్వ పాఠశాలలకు చోటు దక్కింది. అదే ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే జూన్ 12 నాటికి వసతులను కల్పించాలని డెడ్‌లైన్ విధించుకున్నది. అయితే ఇప్పటికి రెండేళ్లు గడిచినా తొలి విడత ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో పనులు పూర్తికాలేదు. ఇక రెండో విడత, మూడో విడత ప్రభుత్వ పాఠశాలలో పనుల పూర్తి గురించి ఆలోచించే స్థితిలో జిల్లా యంత్రాంగం లేదని పేర్కొనవచ్చు. తొలి విడత ఎంపిక చేసిన పాఠశాలలో 333 పాఠశాలల్లో రూ.30 లక్షల లోపు అంచనాలతో పనులను మంజూరు చేశారు. వీటిలో నాలుగు పాఠశాలల్లో పనులను ప్రారంభించలేదు. ఇక రూ.30 లక్షలకుపైగా అంచనాలతో 108 పాఠశాలల్లో పనులు మంజూరయ్యాయి. ఇందులో ఆరు పాఠశాలల్లో పనులను ప్రారంభించనే లేదు.

'మన ఊరు మన బడి' కథ కంచికేనా?

స్కూళ్లలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు కానీ, స్కూళ్ల నిర్వహణ కమిటీ కాని ముందుకు రావడం లేదు. తాము పనులు చేపట్టినా సకాలంలో బిల్లుల చెల్లింపు జరగదేమోనన్న ఆందోళనతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికార వర్గాలు తెలిపాయి.

తొలి విడతలో 41 పాఠశాలల్లోనే పనులు

మొత్తం మీద 441 పాఠశాలల్లో చేపట్టిన వివిధ పనుల్లో 179 పాఠశాలల్లోనే కొంతమేర పూర్తయ్యాయి. మిగిలిన 262 ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా కనిపిస్తున్నాయి. పాఠశాలలకు అవసరమైన గ్రీన్‌చాక్ బోర్డులు, డ్యూయల్ డెస్కులు, కుర్చీలు, టేబుళ్లు కూడా పూర్తిస్థాయిలో అందలేదు. పాఠశాల ప్రహరీ గోడలో విద్యాప్రాముఖ్యత, జాతీయ నేతల గురించి తదితర అంశాలపై వేయించాల్సిన పెయింటింగ్ పూర్తి చేయించలేదు. 441 ప్రభుత్వ పాఠశాలల్లో 41 పాఠశాలల్లోనే చెప్పుకోదగ్గ స్థాయిలో పనులు పూర్తి అయ్యాయి. ఇలా పూర్తయిన అన్ని రకాల పనులతో పాటు అసంపూర్తిగా వదిలేసిన పనులకు ఇప్పటివరకు ప్రభుత్వం రూ.76 కోట్లు చెల్లించడం గమనార్హం. ఇటువంటి పరిస్థితుల్లో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దే మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం సమీక్షిస్తుందా లేదా వేచి చూడాలి. దీనిపై విద్యాశాఖ వర్గాలకు స్పష్టత కొరవడింది.


సంగారెడ్డిలోని రాజంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో నల్లాలకు బిగించని ట్యాపులు


సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి జడ్పీ హైస్కూల్‌లో పిల్లర్ల స్థాయిలో నిలిచిన డైనింగ్‌హాలు నిర్మాణం

లక్ష్యం దిశగా..


పంచాయతీ కార్యాలయంలో పన్ను రిసిప్ట్ ఇస్తున్న అధికారులు(ఫైల్)

325 పంచాయతీల్లో వందశాతం పన్ను వసూళ్లు

- మెదక్ జిల్లా వ్యాప్తంగా 82 శాతం పూర్తి
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష్యం రూ.10.58 కోట్లు
- ఇప్పటివరకు వసూలైంది రూ.8.87 కోట్లు
- నెలాఖరు వరకు ముగియనున్న గడువు
- సర్పంచ్‌లు లేక భారమంతా కార్యదర్శులపైనే

మెదక్ అర్బన్, మార్చి 14 : గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరులైన పన్నుల వసూలపై అధికారులు దృష్టి సారించారు. మెదక్ జిల్లా వసూళ్లలో లక్ష్యం దిశగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 469 గ్రామ పంచాయతీలు ఉంటే ఇప్పటికే 325 గ్రామ పంచాయతీల్లో వందశాతం పన్నులను వసూలు చేశారు. వరుసగా తొమ్మిదేళ్ల నుంచి వందశాతం పన్నులను వసూలు చేసిన జాబితాలో మెదక్ జిల్లా ముందుంటుంది. అధికారులు ఈ ఏడాది అదే స్ఫూర్తితో ముందుకెళ్తున్నారు. నెలాఖరుతో గడువు ముగుస్తుండడంతో లక్ష్యాన్ని చేరుకునేందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఇంటింటికీ వెళ్లి వసూళ్లు చేపడుతున్నారు.

మిగిలిన 18 శాతం వసూళ్లపై అధికారులు దృష్టి

ఈ ఆర్థిక సంవత్సరానికి 2023-24 సంబంధించి జిల్లాలోని 21 మండలాల్లోని 469 గ్రామపంచాయతీలకు సంబంధించి రూ.10,58,22,691 పన్ను వసూలును లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటివరకు రూ.8,87,04,501 వసూలయ్యాయి. ఇంకా రూ.1,71,18,190 వసూలు కావాల్సి ఉంది. జిల్లాలో 82 శాతం వసూళ్లు నమోదయ్యాయి. కాగా, మిగిలిన 18 శాతంపై అధికారులు దృష్టి సారించారు. అయితే 325 గ్రామ పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు కాగా, మిగిలిన 144 జీపీల్లో లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు పనిచేస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఆస్తి, నల్లా, వృత్తి, పన్నులు, సంతలు, జాతరల నుంచి వచ్చే ఆదాయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నెల క్రితం దాక సర్పంచ్‌లు పదవిలో ఉండగా, ఫిబ్రవరి 1తో వారి పదవీకాలం ముగిసింది. దాంతో పన్నుల వసూలు బాధ్యత మొత్తం కార్యదర్శులపైనే పడింది.

వందశాతం లక్ష్యాన్ని చేరుకుంటాం



మెదక్ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.10.58 కోట్లు టార్గెట్ నిర్ణయించగా.. ఇప్పటివరకు 82 శాతం వసూలయ్యాయి. ఈ నెలాఖరు వరకు జిల్లాలో ఇంటి పన్ను వసూళ్లలో వంద శాతం లక్ష్యాన్ని చేరుకుంటాం. గ్రామాల్లో ప్రజలు అధికారులు, సిబ్బందికి సహకరించాలి. సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి.

- యాదయ్య, మెదక్ జిల్లా పంచాయతీ అధికారి

ఒత్తిడి వద్దు.. ప్రశాంతంగా పరీక్షలు రాయండి

- పదో తరగతి విద్యార్థులకు డీఈవోల సూచన


సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్/నిజాంపేట, మార్చి 14 : పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 18న ప్రారంభం కానుండగా, వచ్చే నెల 2 వరకు జరగనున్నాయి. ఒత్తిడికి గురికావద్దని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు మెదక్, సంగారెడ్డి జిల్లాల విద్యాశాఖ అధికారులు సూచనలు చేశారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాలకు తీసుకురాకూడదని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని, వచ్చేటప్పుడు హాల్‌టికెట్, పెన్, పెన్సిల్, రైటింగ్ ప్యాడ్ వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు. హాల్‌టికెట్ అందని, పోగొట్టుకున్న వారు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని నేరుగా కేంద్రాలకు వెళ్లి పరీక్ష రాయవచ్చన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినా, సిబ్బంది ప్రోత్సహించినా చర్యలుంటాయని హెచ్చరించారు. పాఠశాలకు సంబంధించిన యూనిఫాంలో కేంద్రాలకు రాకూడదని ఇతర దుస్తుల్లో పరీక్షకు హాజరుకావాలని సూచించారు. ఉదయం 9.35 గంటల వరకు కేంద్రంలోకి అనుమతిస్తారని ఆలా అని ఉద్దేశపూర్వకంగా ఆలస్యంగా వచ్చి ఇబ్బంది పడొద్దన్నారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని చెప్పారు. పరీక్షలపై పకడ్బందీ నిఘా ఉంటుందని, పరీక్షలకు సంబంధించిన సమాచారం కోసం 9866162182 నంబర్‌ను సంప్రదించాలని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

పదో తరగతి విద్యార్థులు నిర్దేశిత సమయం కంటే గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకుంటే ఎలాంటి ఆందోళన ఉండదని మెదక్ డీఈవో రాధాకిషన్ అన్నారు. గురువారం నిజాంపేట మండల పరిధిలోని బచ్చురాజ్ పల్లి, తిప్పనగుళ్ల, కల్వకుంట్ల, నర్లాపూర్, రాంపూర్, చల్మెడ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడం ముఖ్యం కాబట్టి సాత్విక ఆహారం, నియమిత నిద్ర, సమయానికి మంచినీరు ఎక్కువగా తీసుకుంటే ఎలాంటి భయాందోళనకు లోను కాకుండా పరీక్షలు ప్రశాంతంగా రాయవచ్చని సూచించారు. ఆయన వెంట ఏఎంవో సుదర్శనమూర్తి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.


విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న మెదక్ డీఈవో రాధాకిషన్

ఐడీఎస్‌ఎంటీ లేఅవుట్ అధోగతి

- రెండు దశాబ్దాలైనా ఫేజ్-2కు మోక్షమేదీ?

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 14 : చిన్న, మధ్య తరహా పట్టణాల సమగ్ర అభివృద్ధి పథకం(ఐడీఎస్‌ఎంటీ) ద్వారా మెదక్ పట్టణంలో ఫేజ్-2 లేఅవుట్ ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటికీ సమస్య కొలిక్కి కావడం లేదు. 2004లో 15 ఎకరాల విస్తీర్ణంలో ఐడీఎస్ ఎంటీ ఫేజ్-2 లేఅవుట్ ఏర్పాటుకు అనుమతిని పొందారు. అయితే, లేఅవుట్ విస్తీర్ణానికి క్షేత్రస్థాయిలో స్థలం లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. 15 ఎకరాలకు స్థానికంగా 8.36 ఎకరాలే ఉండటంతో ఐడీఎస్ఎంటీ లేఅవుట్ ఏర్పాటులో జాప్యం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం పట్టణంలో కొలువుదీరిన మున్సిపల్ పాలకవర్గం పెండింగ్‌లో ఉన్న ఫేజ్-2 స్థలాలపై దృష్టిసారించింది. అప్పటి చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ప్రస్తుత చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ), డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(డీఎంఏ) అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో స్థలం లేనందున తిరిగి రివైజ్డ్ లేఅవుట్ చేయాలని కోరారు. స్పందించిన అధికారులు లేఅవుట్‌కు స్థలం కొరత ఏర్పడటంతో ప్లాట్ల విస్తీర్ణాన్ని 150, 180, 200 గజాలకు కుదించి లేఅవుట్ మ్యాపింగ్ చేశారు. ఈ లేఅవుట్‌ను డీటీసీపీ, డీఎంఏ అధికారులు పరిశీలించగా వారు సంతృప్తి వ్యక్తం చేసి అనుమతినిచ్చారు. అయితే, అప్పట్లో ఐడీఎస్‌ఎంటీ ఫేజ్-2 లేఅవుట్‌ల కోసం 60 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. అందులో కొంతమంది 25 శాతం వరకు డబ్బు చెల్లించారు.

ఐదుగురితో లోకల్ లెవల్ కమిటీ

ఐడీఎస్‌ఎంటీ ఫేజ్-2 స్థలాల విక్రయానికి లోకల్ లెవల్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో రీజనల్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి, రీజనల్ డైరెక్టర్ డిస్ట్రిక్ట్ ప్లానింగ్ అధికారి, పబ్లిక్‌హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీర్, స్థానిక మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌తో కలిపి కమిటీని ఏర్పాటు చేశారు. వారంతా కలిసి 2019లో దరఖాస్తుదారులతో కలిసి సమావేశమయ్యారు. పెరిగిన పట్టణ విస్తీర్ణం, భూధరలను దృష్టిలో ఉంచుకొని మార్కెట్ వాల్యు ప్రకారం ధర చెల్లించాలని కమిటీ సూచించింది. ఈమేరకు దరఖాస్తుదారులు కూడా ఒప్పుకున్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారి భూపతి తెలిపారు. ముందస్తుగా అప్పటి ధర ప్రకారం 25 శాతం చెల్లించిన వారు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం మిగతా డబ్బు చెల్లిస్తే ప్లాటు కేటాయిస్తారు. కానీ ఇప్పటివరకు ప్లాట్ తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఒకవేళ దరఖాస్తుదారుల్లో ఎవరైన ప్లాటు కోసం డబ్బు చెల్లించేందుకు వచ్చినా తిరిగి కమిటీ సమావేశమై దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. గత చైర్మన్ ఉన్నప్పుడు కమిటీ సమావేశం జరిగింది. ప్రస్తుతం మరొక చైర్మన్ ఉన్నందున, అలాగే సమావేశమై నాలుగైదు సంవత్సరాలు గడిచిపోగా తిరిగి కమిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అప్పటి వరకు ఈ లేఅవుట్‌పై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

ఖేడ్‌లో మూడు ప్రైవేటు ఆస్పత్రుల సీజ్

- ఆకస్మిక తనిఖీలు చేపట్టిన డీఎంహెచ్‌వో
- అనుమతులు లేకపోవడంతో కొరడా


నారాయణఖేడ్ పట్టణంలో అనుమతిలేని ఆస్పత్రిని సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో

నారాయణఖేడ్, మార్చి 14 : నారాయణఖేడ్ పట్టణంలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న మూడు ప్రైవేటు ఆస్పత్రులను సీజ్ చేసినట్లు సంగారెడ్డి డీఎంహెచ్‌వో గాయత్రిదేవి తెలిపారు. నారాయణఖేడ్ పట్టణంలో గురువారం డీఎంహెచ్‌వో అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో సురక్ష క్లినిక్, శ్రీసాయివాణి, హెల్త్ పాయింట్ ఆస్పత్రులు ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్నట్లు గుర్తించామని, వీటిని సీజ్ చేసినట్లు తెలిపారు. హెల్త్ పాయింట్ క్లినిక్‌లో పది మంది వరకు రోగులు ఉండగా, తనిఖీలను పసిగట్టి ఆస్పత్రి వారు రోగులను ఆస్పత్రి లోపలే ఉంచి తాళాలు వేసి వెళ్లారని డీఎంహెచ్‌వో ఆగ్రహంవ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో తిరిగి తాళం తీశారని, దీంతో రోగులను బయటకు పంపించినట్లు ఆమె వివరించారు. అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా వైద్యశాలలు వెలుస్తున్నాయని, జిల్లాలో ఇప్పటివరకు దాదాపు 30కిపైగా ఆస్పత్రులను సీజ్ చేశామని డీఎంహెచ్‌వో తెలిపారు. ప్రభుత్వంతోపాటు అన్ని ప్రైవేటు వైద్యశాలలు, ఆయుష్మాన్ భారత్ ద్వారా అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 300 వరకు వైద్యశాలలు అనుమతులకు ఆన్‌లైన్ చేశారన్నారు. క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఫిజియోథెరపీ కేంద్రాల వారు కూడా అన్ని అనుమతులు పొందాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అతిథి ఇదేంగతి..!



- గెస్ట్ లెక్చరర్లకు సకాలంలో అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో అధ్యాపకులు
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆదుకోవాలని విన్నపం



సంగారెడ్డి రూరల్, మార్చి 14 : విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ వారిని విద్యలో ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తున్న అతిథి అధ్యాపకులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. గత ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నా తమను పట్టించుకున్న పాపాన పోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తమ బతుకులు మారతాయని భావించినా తమకు నిరాశే మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మూడు నెలలకోసారి వేతనాలు వచ్చేవని, ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్‌లోనూ అదే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

8 నెలలు మాత్రమే జీతం

సంగారెడ్డి జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 105 మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. గెస్ట్ లెక్చరర్లకు ప్రభుత్వం 2017లో ప్రారంభ వేతనం నెలకు రూ.10 వేలు అందించేది. ఏడాది తరువాత పది వేల నుంచి రూ.21 వేలకు పెంచింది. తిరిగి 2020-21లో రూ.28 వేలకు పెంచారు. 2023 ఫిబ్రవరిలో నిర్వహించిన బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే అతిథి అధ్యాపకులకు 12 నెలల జీతాలు మంజూరు చేయాలని అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశించినా అమలు చేయలేదు. విద్యా సంవత్సరం జూన్, జూలైలో ప్రారంభమైనా వారిని ఆగస్టులో విధుల్లోకి తీసుకోవడం వల్ల 7 నుంచి 8 నెలల జీతం మాత్రమే చెల్లిస్తున్నారు. రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకులతో సమానంగా విధులు నిర్వహించినా గుర్తించకుండా నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారని వారు వాపోయారు.

రెన్యూవల్ చేయకుండా ఇబ్బందులు

అతిథి అధ్యాపకులను రెన్యూవల్ చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ 2023లో రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ బోర్డు కొత్త నోటిఫికేషన్ తీసుకొచ్చింది. దీంతో గెస్ట్ లెక్చరర్లు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ధర్మాసనం ఇంటర్ బోర్డు ప్రకటించిన కొత్త నోటిఫికేషన్ చెల్లదని, పాత లెక్చరర్లనే కొనసాగించాలని తీర్పు వెలువరించింది. అయినా, అప్పటి ప్రభుత్వం హైకోర్టు ఆదేశాలను అమలు చేయలేదు. దీంతో అతిథి అధ్యాపకులు ఆందోళన బాట పట్టారు. దిగొచ్చిన ప్రభుత్వం పాతవారినే విధుల్లోకి తీసుకుంది. కానీ, వేతనాలు ఇవ్వడంలో ఇబ్బందులకు గురిచేసింది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ప్రతి నెలా వేతనాలు సక్రమంగా అందుతాయని భావించిన వారికి చుక్కెదురైంది. గెస్ట్ లెక్చరర్లు మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

డిమాండ్లు ఇవే

- హైకోర్టు జీవో 28131, 2023 ఉత్తర్వుల మేరకు ఎంటీఎస్ (మినిమం టైం స్కేల్) ద్వారా ఉద్యోగ భద్రత కల్పించాలి.
- అతిథి అధ్యాపకులకు 72 పీరియడ్స్‌ను రద్దు చేసి 12 నెలల వేతనాలు మంజూరు చేయాలి.
- త్రీమెన్ కమిటీ ద్వారా అతిథి అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి
- రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకులతో సమానంగా రూ.42 వేలు వేతనం చెల్లించాలి.

న్యాయం చేయాలి



గత ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోలేదు. ఇప్పుడు కూడా మూడు నెలల నుంచి వేతనాలు లేవు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి త్వరగా పరిష్కరించాలి.

- శ్రీశైలం, అతిథి అధ్యాపకుల యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

సక్రమంగా వేతనాలివ్వాలి



మాకు ప్రతి నెల సక్రమంగా వేతనాలివ్వాలి. కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకంతో గెలిపించాం. మా సమస్యలను పరిష్కరించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి విన్నవించగా సానుకూలంగా స్పందించారు.

-సాయిబాబ, యూనియన్ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి



రెగ్యులర్, కాంట్రాక్టు లెక్చరర్లతో సమానంగా పనిచేస్తున్న మమ్మల్ని ప్రభుత్వం గుర్తించాలి. రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. ఇతర సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలి.

- వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి

తిరుమలలో తప్పిపోయిన సిద్దిపేట యువతి

తిరుమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం కోసం తల్లితో తిరుమలకు వచ్చిన ఓ యువతి తప్పిపోయింది. తల్లి వివరాల మేరకు.. తెలంగాణలోని సిద్దిపేట జిల్లా, బెజ్జంకికి చెందిన డొక్క సారమ్మ మానసిక దివ్యాంగురాలైన కుమార్తె డొక్క రాజేశ్వరి(24)తో కలిసి గతేడాది నవంబరు 13న తిరుమలకు వచ్చింది. దర్శనం అనంతరం రాజేశ్వరితో కలిసి ఆలయం ముందున్న అఖిలాండం వద్దకు చేరుకున్నారు. అక్కడున్న మెట్లపై కూర్చోబెట్టి టీ తీసుకొచ్చేందుకు సారమ్మ వెళ్లింది. తిరిగొచ్చి చూసేసరికి రాజేశ్వరి కనిపించలేదు. దీంతో సారమ్మ పరిసర ప్రాంతాలతో పాటు తిరుమల మొత్తం గాలించింది. ఆచూకీ లభ్యం కాకపోవడంతో సొంతూరుకు చేరుకుని వెతికింది. ఆ తర్వాత వారి కుటుంబసభ్యులు తిరుమలకు చేరుకుని డిసెంబరు 29న తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తె రాజేశ్వరి వివరాలు తెలిసిన వారు 81063 56409 ఫోన్ నెంబరుకు తెలియజేయాలని ఆమె కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కల్హేర్/సిర్గాపూర్, మార్చి 14: విద్యుదాఘాతంతో యువకుడు గురువారం మృతిచెందాడు. సిర్గాపూర్ మండలం ఖాజాపూర్ గ్రామానికి చెందిన వడ్డె శ్రీను అడవి పందుల బెడద నుంచి జొన్న పంటను కాపాడుకునేందుకు విద్యుత్ కంచెను ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఏర్పాటు చేశాడు. అయితే ఇదే గ్రామానికి చెందిన అంతర్గామ జైపాల్(30) వడ్డె శ్రీను జొన్న చేను పక్కన తన పశువులకు మేత కోస్తున్నాడు. పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగను జైపాల్ గమనించకపోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మేత కోసం వెళ్లిన జైపాల్ ఎంతకీ తిరిగి రాకపోవడంతో భార్య సావిత్రి, కుటుంబసభ్యులు వెళ్లి చూసేసరికి విగతజీవిగా పడి ఉన్నాడు. తన భర్త మృతికి కారణమైన శ్రీనుపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య సావిత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి టీకాలు

సంగారెడ్డి రూరల్, మార్చి 14: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఈ నెల 15 నుంచి 30 వరకు టీకాలు వేయనున్నట్టు పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి డి.వసంత కుమారి గురువారం తెలిపారు. దీనికిగాను 2 నుంచి 3 పశువైద్య సిబ్బంది బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మూడునెలల వయస్సు పైబడిన పశువులన్నింటికీ ఉచితంగా టీకాలు వేస్తామని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, పాడి రైతులకు సమాచారం అందించేలా చూడాలన్నారు. ఉదయాన్నే సిబ్బంది వెళ్లి పశువులకు టీకాలు వేస్తారని తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి ప్రమాదకరమని, ఈ వ్యాధిన బారిన పడితే పశువులకు నోటిలో, కాళ్లలో పుండ్లు ఏర్పడి మేత మేయడం, నడవడంలో ఇబ్బందులు పడతాయని వివరించారు.

కార్మికుల భద్రత గాలికి..

- పరిశ్రమలలో తరచూ ప్రమాదాలు
- కార్మిక చట్టాలు పట్టించుకోని యాజమాన్యాలు
- గాలిలో కలుస్తున్న కార్మికుల ప్రాణాలు
- అధికారుల పర్యవేక్షణ శూన్యం

- 2021 అక్టోబరు 11న కోవాలెంట్ పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-3లో రియాక్టర్ క్లీన్ చేస్తుండగా ప్రమాదం సంభవించి అల్లాదుర్గం మండలం బైరన్‌దిబ్బ గ్రామానికి చెందిన వీరన్న తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

- 2016 డిసెంబరు 28 ఇదే పరిశ్రమలో రియాక్టర్ పేలి అక్కడ విధులు నిర్వహిస్తున్న సంగారెడ్డి సమీపంలోని రాజంపేట గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ తీవ్రగాయాలకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు.

- ఈనెల 5న పీబీ-4లో జరిగిన అగ్ని ప్రమాదంలో నలుగురు తీవ్రగాయాలకు గురయ్యారు. అందులో హత్నూర గ్రామానికి చెందిన నీరుడి వినోద్‌కుమార్, జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన లై బాబు తురై, ఫాదర్ మారండిలు మృతిచెందారు.

పైన సంఘటనలే కాకుండా... సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని ఆయా పరిశ్రమలలో జరుగుతున్న ప్రమాదాలకు కార్మికులు బలవుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హత్నూర, మార్చి 14: హత్నూర మండలంలోని గుండ్లమాచునూర్, బోర్పట్ల, తుర్కలఖానాపూర్, చందాపూర్ గ్రామపంచాయతీల పరిధిలో పలు రసాయన, స్టీల్ పరిశ్రమలు ఉన్నాయి. తమ ప్రాంతంలో సరైన ఉపాధి లేక బతుకుదెరువు కోసం పొట్ట చేత పట్టుకొని ఇతర రాష్ట్రాల నుంచి వందలాదిమంది కార్మికులు మండలంలోని పరిశ్రమల్లో పనిచేసేందుకు వస్తున్నారు. పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలకు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రశ్నించేవారు లేక యాజమాన్యాలు, కాంట్రాక్టర్లు ఆడిందే ఆట అన్న చందంగా పరిస్థితి తయారైంది. తరచూ తనిఖీలు చేసి కార్మికుల భద్రత కోసం చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎక్కడా కనిపించడం లేదు.



హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామ శివారులోని కోవాలెంట్ పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబీకులు(ఫైల్)

అనుభవం లేని కార్మికులతో పనులు

ఉన్నత చదువులు చదివి అనుభవం ఉన్న కార్మికులను విధుల్లో పెట్టుకుంటే ఎక్కువ వేతనం ఇవ్వాల్సి వస్తుందన్న దురుద్దేశంతో అనుభవం లేని కార్మికులను విధుల్లో చేర్చుకుంటున్నారు. యంత్రాల వద్ద ఈ కార్మికులతో పరిమితికి మించి పనులు చేయించడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్మికులకు రక్షణ పరికరాలను ఇవ్వకపోవడం, యంత్రాల పనితీరుపై అవగాహన లేకపోవడం, ప్రమాదాలు సంభవిస్తే తప్పించుకునే జాగ్రత్తలు తెలియక చిన్న చిన్న ప్రమాదాలకే ప్రాణాలు కోల్పోతున్నారు.

బయటకు పొక్కకుండా..

పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినా కంపెనీల యాజమాన్యాలు బయటకు పొక్కనీయడం లేదు. బాధిత కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేసి ఎంతో కొంత ముట్టజెప్పి చేతులు దులుపుకుంటున్నారు. ప్రతి పరిశ్రమల్లో భద్రత అధికారి (సేఫ్టీ ఆఫీసర్) నిత్యం కార్మికులకు భద్రతపై అవగాహన కల్పించాల్సి ఉన్నది. అనుకోకుండా ప్రమాదాలు సంభవిస్తే ఎలా వ్యవహరించాలనే అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించాలి. కానీ ఆయా పరిశ్రమలల్లో అలాంటివేవీ జరగడం లేదు.

మృతుల్లో పొరుగు రాష్ట్రాల వారే అధికం

హత్నూర మండలంలోని పరిశ్రమల్లో ఒడిస్సా, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన కార్మికులే అధికంగా పనిచేస్తున్నారు. వారికి కార్మిక చట్టాలు.. రక్షణ పరికరాల గురించి అంతగా తెలియదు. ఇదే అదునుగా భావించిన పరిశ్రమల యాజమాన్యాలు, కాంట్రాక్టర్లు వారిచేత నిర్ణీత పని గంటల కంటే ఎక్కువ పనిచేయిస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన సమయంలో ఇతర రాష్ట్రాల కార్మికులే అధికంగా చనిపోతున్నారు. చికిత్స పేరుతో గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాలకు తరలించి ఎంతో కొంత పరిహారం చెల్లించి మృతదేహాలను వారి సొంత గ్రామాలకు పంపుతున్నారు. మృతుల కుటుంబీకులను కనీసం పరిశ్రమ వద్దకు కూడా రానివ్వడం లేదంటే పరిశ్రమల యాజమాన్యాల తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అధికారుల పర్యవేక్షణ శూన్యం

మండలంలోని పరిశ్రమలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ... ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అంతగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ తనిఖీ పేరుతో అధికారులు వచ్చినా.. పరిశ్రమల యాజమాన్యాలు రాచ మర్యాదలు చేసి ఎంతో కొంత ముట్టజెప్పుతుండడంతో నామమాత్రంగా తనిఖీలు చేసి వెళ్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగానే పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం

పరిశ్రమలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భద్రతా ప్రమాణాలపై పరిశ్రమల యాజమాన్యాలకు సలహాలు, సూచనలు చేస్తున్నాం. గుండ్లమాచునూర్ గ్రామ శివారులోని కోవాలెంట్ లాబోరేటరీస్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై ప్రాథమిక విచారణ చేసి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నాం. పూర్తి విచారణ అనంతరం ఆ పరిశ్రమపై చర్యలు తీసుకుంటాం.

\- ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్



కోవాలెంట్ పరిశ్రమలో ముగ్గురు కార్మికుల మృతికి కారణమైన రియాక్టర్(ఫైల్)

వైభవంగా రాచన్నస్వామి జాతర ప్రారంభం



ఆలయం ముందు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కోహీర్, మార్చి 14: మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల రాచన్నస్వామి జాతర గురువారం వైభవంగా ప్రారంభమైంది. మూడురోజులపాటు జరిగే ఈ జాతరలో భాగంగా మొదటిరోజైన గురువారం ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగ పూజ, గోపూజ, స్వస్తి పుణ్యావచనం, అంకురార్పణ, నాంది సమారాధన అఖండ దీపా ప్రజ్వలన కార్యక్రమాలతో పాటు శివయోగి శివాచార్య మహాస్వామి తంగడపల్లిచే ధ్వజారోహణం, శిఖర పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు అమృత ప్రవచనాలు, 10 నుంచి 12 గంటల వరకు హరికథ, భజనలు, బుర్రకథ నిర్వహించారు. రాత్రి 11 గంటలకు పట్లోళ్ల శివశరణప్ప గృహం నుంచి శ్రీమఠం రాచయ్యస్వామి గురువు గృహం వరకు ఊరేగింపుగా బయల్దేరి అక్కడి నుంచి దేవస్థానం వరకు వచ్చి అగ్ని ప్రతిష్ట (అగ్ని దహనం) చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శివరుద్రప్ప, జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దయానంద్ పాటిల్, సభ్యులు స్వరూప, శ్రీపాల్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతం నుంచి మహోన్నతంగా ఎదగాలి

- సిద్దిపేట అదనపు కలెక్టర్ అగ్రవాల్

సిద్దిపేట రూరల్, మార్చి 14: విద్యార్థులు వారి మేధాశక్తిని ఉపయోగించి మారుమూల ప్రాంతం నుంచి మహోన్నతంగా ఎదగాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ అగ్రవాల్ సూచించారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడ్ గ్రామంలో గల తెలంగాణ మోడల్ స్కూల్‌లో జరిగిన విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు గొప్ప లక్ష్యంతో చదవాలన్నారు. తల్లిదండ్రుల కష్టాలకు ప్రతిఫలమే విద్యార్థులు పరీక్షల్లో సాధించే ఉత్తమమైన ఫలితాలని చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తిని వెలికితీసేందుకు జన విజ్ఞానవేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ఇర్కోడ్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమస్థానం సాధించడం, ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లా సైక్లింగ్ పోటీలో మోడల్ స్కూల్ విద్యార్థి శ్రీధర్ ద్వితీయస్థానం సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా చెకుముకి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన సూర్యతేజ, ఉదయ్, అశ్విన్‌లను, ఉమ్మడి జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలో ద్వితీయస్థానం సాధించిన శ్రీధర్ తల్లిదండ్రులను శాలువా కప్పి సన్మానించారు. చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రథమస్థానం సాధించినందుకుగాను మోడల్ స్కూల్‌కు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో టెలిస్కోప్‌ని బహుకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బుచ్చిబాబును, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర, జిల్లా కమిటీ ప్రతినిధులు, మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర, జిల్లా కమిటీ ప్రతినిధులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కౌడిపల్లి, మార్చి 14: అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతిచెందాడు. కౌడిపల్లి మండలం కంచన్‌పల్లి గ్రామానికి చెందిన నీలబోయిన దశరథ(38) మూడేళ్ల నుంచి ప్రకృతి వనంలో మొక్కలు పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం నర్సరీలో మొక్కలకు నీరు పెట్టేందుకు వెళ్లి అక్కడే కిందపడిపోయి ఉన్నాడన్న సమాచారం కుటుంబీకులు తెలుసకుని 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంజిత్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ఒకరికి రిమాండ్

సిద్దిపేట రూరల్, మార్చి 14: కూలి డబ్బుల కోసం హత్యకు పాల్పడిన వ్యక్తిని సిద్దిపేట రూరల్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను హత్యకు గల వివరాలను వెల్లడించారు. సిద్దిపేట రూరల్ మండలం చిన్న ఉండవెల్లి గ్రామ శివారులోని ఎల్లంకి కళాశాల సమీపంలో ఓ ఇంటి నిర్మాణ పనికి తిరుపతి, రమేష్, రాజయ్య ఈనెల 10న కూలీకి వెళ్లారు. ముగ్గురికి కలిపి ఇంటి యజమాని రూ.2 వేలు తిరుపతికి ఇచ్చాడు. రమేష్‌కు, రాజయ్యకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ఇచ్చి మిగతా డబ్బులు తిరుపతి వద్దనే ఉంచుకున్నాడు. మరుసటి రోజు వారికి పని దొరక్కపోవడంతో తిరుపతి, రమేష్ కలిసి వారు కూలీకి వెళ్లిన చోట మద్యం సేవించారు. ఈ క్రమంలో ఏర్పడిన ఘర్షణలో ఇరువురు కట్టెలతో కొట్టుకున్నారు. అయితే రమేష్ తిరుపతిని గట్టిగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన రమేష్ తిరుపతి మృతదేహాన్ని పక్కన ఉన్న కాలువలో పడేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు రమేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు అతడిని గురువారం రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ అపూర్వరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్

సిద్దిపేటరూరల్, మార్చి 14: గంజాయి విక్రయిస్తున్న యువకులను సిద్దిపేట పోలీసులు పట్టుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు, సిద్దిపేట పట్టణంలోని పలు కాలనీలకు చెందిన మరో నలుగురు యువకులతో కలిసి గంజాయి ప్యాకెట్లను లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారులో విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వారి నుంచి 417 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు గురువారం ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం యువకులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అపూర్వరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టుల పేరుతో వాల్‌రైటింగ్, బ్యానర్లు నిందితులు ఇద్దరు అరెస్ట్



పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తొగుట సీఐ లతీఫ్

తొగుట, మార్చి 14: మావోయిస్టుల పేరుతో వాల్‌రైటింగ్, బ్యానర్లు కట్టిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం సాయంత్రం తొగుట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ లతీఫ్ వివరాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరానగర్‌కు చెందిన బోనాల రాజు అలియాస్ గగన్(34) వృత్తి రీత్యా డ్రైవర్. అతడికి గ్రామ శివారులో 6 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా... అందులో 4 ఎకరాల 23 గుంటల భూమిని 2014లో హెటిరో ఫార్మా కంపెనీకి విక్రయించాడు. మిగతా ఎకరా 17 గుంటల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆ భూమికి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఫార్మా కంపెనీ యాజమాన్యం ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేయడం ప్రారంభించింది. దాంతో రాజు కంపెనీ యాజమాన్యంతో పలుమార్లు మాట్లాడినా స్పందించలేదు. తన భూమిని ఎలాగైనా దక్కించుకోవాలనే ఉద్దేశంతో పథకం రచించాడు. మహారాష్ట్రకు చెందిన రాజు స్నేహితుడు యాష్ అజయ్(24)ని తీసుకుని ఈ నెల 9న రాత్రి 12 గంటలకు హైదరాబాద్ నుంచి హోండా యాక్టివాపై పెద్దమాసాన్‌పల్లికి చేరుకున్నాడు. గ్రామ శివారులోని పన్యాల ఎల్లారెడ్డి వ్యవసాయ పొలం వద్ద స్టాటర్ డబ్బాకు మావోయిస్టుల హెచ్చరిక పేరుతో రాసిన ఎర్రని వస్త్రంతో కూడిన బ్యానర్ కట్టారు. అక్కడి నుంచి ఫార్మా కంపెనీ సెక్యూరిటీ రూంల గోడలపై వెంట తెచ్చుకున్న కలర్ డబ్బాలతో మావోయిస్టుల పేరుతో హెచ్చరిక రాతలు రాసి వెళ్లిపోయారు. కంపెనీ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గురువారం సాయంత్రం తొగుట ఎస్ఐ లింగం ఆధ్వర్యంలో పోలీసులు తొగుటలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. రాజు, అతడి స్నేహితుడు యాక్టివాపై అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే వారిని పట్టుకుని విచారించగా పెద్దమాసాన్‌పల్లి ఫార్మా కంపెనీ భూముల గోడలపై మావోయిస్టుల పేరుతో బ్యానర్, వాల్‌రైటింగ్ రాసినట్లు ఒప్పుకున్నారని సీఐ వివరించారు. వారి నుంచి రంగు డబ్బాలు, బ్రష్, సెల్‌ఫోన్, హోండా యాక్టివా వాహనంతో పాటు ఆరోజు వారు వేసుకున్న దుస్తులను సీజ్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తొగుట ఎస్ఐ లింగం, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ‘పది’లమే

- తడబాటు, ఒత్తిడికి దూరంగా ఉండాలి ● భయం వీడితో విజయం మీదే అంటున్న నిపుణులు

కొండపాక, మార్చి 14: విద్యార్థి దశకు పదో తరగతి తొలిమెట్టు... మరో మూడురోజుల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. పదిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించడం కోసం పలు సూచనలు జాగ్రత్తలు పాటిస్తే భయం లేకుండా అధిక మార్కులను సాధించవచ్చు. పది పరీక్షల్లో చిన్నపాటి తప్పిదాలతో మార్కులు కోల్పోతున్నారు. తొలిసారి రాసే పబ్లిక్ పరీక్షలు కావడంతో పిల్లల్లో ఒత్తిడి, తడబాటు ఉంటుంది. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే జయించవచ్చు. పరీక్షలు రాసేటప్పుడు చిన్న చిన్న తప్పులు చేయడంతో మార్కులను కోల్పోతున్నారు. ఈ విషయాలన్నింటిపై విషయ పరిజ్ఞాన నిపుణులు, సబ్జెక్టు టీచర్లు పలు సూచనలు అందిస్తున్నారు. వాటిని పాటిస్తే విద్యార్థులు అధిక మార్కులను సాధించవచ్చని చెబుతున్నారు. ఎంత కష్టపడి చదివినా పరీక్షల్లో ఏం రాయగలిగాం, ఎంత బాగా రాయగలిగామన్నదే ప్రధానం. ఏడాది పొడవునా ముందస్తు పరీక్షలు ఎన్ని నిర్వహించినా.. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఎన్నో పొరపాట్లు చేస్తున్నారు. సాధారణ పరీక్షల్లో జరిగే తప్పుల వల్ల నష్టం ఏమీ లేకపోవచ్చు. కానీ చివరి పరీక్షల్లో అవే పొరపాట్లు పునరావృతమైతే జరిగే నష్టం అపారమని ఉపాధ్యాయులు హెచ్చరిస్తున్నారు. పగలు, రాత్రి చెమటోడ్చి చదవటమే కాదు.. అలా చదివింది, తప్పిదాలకు తావీయకుండా పరీక్షల్లో సమర్థంగా రాయగలిగినప్పుడే చక్కని ఫలితం వస్తుంది.

సమాధాన పత్రాలతో కూడిన బుక్‌లెట్ ఇవ్వగానే ముందుగా ప్రతి పేజీకి ఎడమవైపు మార్జిన్ వదలాలి. పేపరు దిద్దేవారు మార్కులు వేయటానికి ఇది అవసరం. లేకపోతే ఒక్కోసారి జవాబుకు వేసిన మార్కులు కనిపించక లెక్కవేయడం మరిచిపోతుంటారు. దీన్ని చాలామంది విద్యార్థులు పాటించరు. ప్రశ్నాపత్రం ఇవ్వగానే క్షుణ్ణంగా చదువుకోవాలి. ప్రశ్నాపత్రం చదవడానికి 15 నిమిషాలు సమయం కేటాయించారు. కానీ అలా చేయకుండా రాయడానికి సిద్ధమవుతారు. ముందుగా ప్రశ్నలను బాగా చదివాకే సమాధానాలు రాయటం ఆరంభించాలి. ప్రశ్నాపత్రంలో బాగా వచ్చిన ఏ ప్రశ్నకైనా ముందుగా జవాబు రాయెుచ్చు. ఆ ప్రశ్న నంబరును ఎడమవైపు మార్జిన్‌లో తప్పక వేయాలి.

ఇవి పాటించండి

\- రాయాల్సినవన్నీ పూర్తయ్యాకే ఛాయిస్ ప్రశ్నలు రాయడానికి ప్రయత్నించాలి. లేకుంటే సమయం సరిపోక ఇబ్బందితలెత్తే అవకాశముంది.

\- పేజీ చివర కొంత ప్రదేశం మిగిలిందని ఇంకో జవాబు రాయటం, పదాన్ని విడకొట్టి రాయటం చేస్తున్నారు. ఇలా చేయకూడదు.

\- ఎర్ర సిరాపెన్ను వాడకూడదు. నీలం బ్లూ, నలుపు సిరా ఉండేవాటినే ఉపయోగించాలి.

\- పెద్దపెద్ద అక్షరాలతో, మరీ ఎక్కువ మార్జిన్ వదిలి భారీగా పేజీలు నింపడం వల్ల ప్రయోజనం శూన్యం. దీనివల్ల దిద్దేటప్పుడు ఉపాధ్యాయులు అసహనానికి లోనవుతారు. ప్రతి పుటకు 20-25 వాక్యాలు రాస్తే మేలు.

\- జవాబులను వ్యాసంలా కాక బుల్లెట్ పాయింట్ల రూపంలో రాయాలి. దానివల్ల మూల్యాంకనం చేసేవారికి సులభంగా అర్థమవుతుంది.

\- బిట్ పేపర్‌లో కొట్టివేతలు, దిద్దివేతలు ఉండరాదు. బ్రాకెట్‌లో ఒకటి రాసి, మళ్లీ కొట్టివేసి బయట రాస్తున్నారు. ఇలా చేయటం సరికాదు.

\- సాధ్యమైనంతవరకు 10-15 నిమిషాలు ముందే పరీక్ష రాయటం పూర్తిచేయాలి. రాసిన జవాబులు, ప్రశ్నల నంబర్లను మరోసారి పరిశీలించుకోవాలి.

సబ్జెక్టుల వారీగా జాగ్రత్తలు

\- గ్రాఫులు, పటాలు, బొమ్మలను పెన్సిల్‌తోనే గీయాలి. పెన్నులు, స్కెచ్ పెన్నులు వాడకూడదు.

\- సాంఘిక శాస్త్రంలోని సమకాలీన అంశాలలో మూస ధోరణులకు ప్రాధాన్యం తగ్గించి, సొంత అవగాహనతో నిత్య జీవిత ఉదాహరణలు అన్వయిస్తూ రాయడం మేలు.

\- గణితం, భౌతిక, జీవ, సాంఘికశాస్త్రాల్లో సమాధానాలు రాసేటప్పుడు మొదట 2 మార్కులవి, తర్వాత ఒక మార్కువి రాయాలి. చివరగా 4 మార్కుల సమాధానాలు రాస్తే మంచిది.

\- ఆంగ్లం, తెలుగు, హిందీలో వ్యాకరణ, అక్షర దోషాలు లేకుండా జాగ్రత్త పడటం చాలా ముఖ్యం.

\- భౌతికశాస్త్రంలోని సమస్యల (ప్రాబ్లెమ్స్)లో ప్రమాణాలను రాయడం మరిచిపోరాదు. ఉదాహరణకు సెంటీ మీటరు, గ్రాము, జౌలు, వాట్స్ తదితరాలు.

\- జీవశాస్త్రంలో ప్రయోగాలకు చెందిన జవాబులను రాసేటప్పుడు సంబంధిత బొమ్మలను కూడా తప్పక వేయాలి.



బెజ్జంకి ఆదర్శ పాఠశాలలో పదో తరగతి పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉజ్వల భవిష్యత్

బెజ్జంకి, మార్చి 14: పదో తరగతి పరీక్షలు అనగానే విద్యార్థులకు ఆందోళన, భయం ఉండడం సహజం. కానీ ప్రణాళికాబద్ధంగా చదివితే పదో తరగతిలో అధిక మార్కులు సాధించవచ్చని విద్యా నిపుణులు చెబుతున్నారు. ప్రతి విద్యార్థి పదో తరగతి తొలిమెట్టుగా భావించి ఏకాగ్రతతో చదువుకుంటే భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవచ్చని ఉపాధ్యాయులు, విద్యా నిపుణులు సూచిస్తున్నారు. బెజ్జంకి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కలిపి మొత్తం 396 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.


జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

కౌడిపల్లి, మార్చి 14: జీవితంపై విరక్తి చెంది ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కౌడిపల్లి మండలం కేంద్రానికి చెందిన మాసన్నగారి నవీన్(34) కొంతకాలంగా తన తల్లి అనారోగ్యానికి గురికావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. కాగా గురువారం ఉదయం చింతపండు కోసమని తన కుమారుడిని వెంట పెట్టుకుని గ్రామ శివారులోని చింత చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి చెల్లి కవిత ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ టవర్ ఎక్కి యువకుల నిరసన

- అనాథలకు ఆశ్రమం ఏర్పాటు చేయాలని డిమాండ్

బెజ్జంకి, మార్చి 14: అనాథాశ్రమం ఏర్పాటు చేయాలని కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చీమలకుంటపల్లి, జంగాపల్లి గ్రామాలకు చెందిన భామండ్ల రాజు, మహంకాళి ప్రశాంత్, కొంకటి వేణు అనే ముగ్గురు యువకులు సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని బాలుర పాఠశాల వెనకాల ఉన్న సెల్‌టవర్ గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్ల వెంట ఎంతోమంది అనాథలు ఉండేందుకు చోటు లేక నిరాశ్రయులుగా మారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారి కోసం తమవంతుగా కొద్దినెలలుగా ఆహారం పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. మంత్రి సీతక్క వచ్చేవరకు కిందికి దిగమని సుమారు రెండు గంటల పాటు టవర్‌పై కూర్చున్నారు. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకులతో మాట్లాడారు. అయినా వినకపోవడంతో అధికారులకు సమాచారాన్ని అందించారు. ఎంపీడీవో లక్ష్మప్ప యువకులతో మాట్లాడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇవ్వడంతో యువకులు సెల్ టవర్ దిగారు. తమకు కూడా అమ్మానాన్నలు లేరని, అనాథలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని గుర్తుచేశారు.



సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

కంది, మార్చి 14: ఉపాధిహామీ కూలీలకు పనిప్రదేశంలో మెడికల్ కిట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, కూలీలకు తట్ట, బుట్ట వంటి పరికరాలను ప్రభుత్వమే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహులు డిమాండ్ చేశారు. గురువారం కంది శివారులో ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోట కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ.. జియో ట్యాగింగ్ పేరుతో ఫొటోలు తీస్తూ ఉపాధిహామీ కూలీలను ఫీల్డ్ అసిస్టెంట్‌లు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. 15 రోజుల్లోగా ఇచ్చే కూలీ డబ్బులను ఎనిమిది వారాలుగా ఇవ్వడం లేదని చెప్పారు. కూలీలకు రావాల్సిన బకాయిలను వెంటచే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేగాక ఉపాధిహామీ కూలీలకు రూ.800 రోజువారి కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సంవత్సరంలో 200 రోజులు కూలీలకు పని కల్పించాలని కోరారు. లేదంటే ఎద్దఎత్తున ఆందోళనలు చేపడతామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహులు హెచ్చరించారు. ఈ సమావేశంలో లక్ష్మయ్య, నరసింహులు, సుజాత, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ నియోజకవర్గానికి మహిళా పారిశ్రామిక హబ్

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, మార్చి 14: మహిళా సాధికారితే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ప్రతీ నియోజకవర్గంలో మహిళల అభివృద్ధి కోసం పారిశ్రామిక హబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గురువారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని బుజ్రాన్‌పల్లి, టెంకటి, కమలాపూర్, ఆరేపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, మహిళల పేరిట ఇందిరమ్మ గృహాల మంజూరు కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను విడతల వారీగా పరిష్కరించడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో తాగునీటిసమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాయిని మధు,



ఆరేపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నాయకులు అలుగుల సత్యనారాయణ, ఆర్ఎన్.సంతోష్‌కుమార్, దానంపల్లి నారాగౌడ్, దాచ సంగమేశ్వర్, రాజేందర్‌గౌడ్, దశరత్, పెరుమాండ్ల గౌడ్, జైపాల్‌గౌడ్, మహేష్‌గౌడ్, శంకర్‌రావు, భీంరావు పాల్గొన్నారు.

అభినందన సమావేశాలు

నారాయణఖేడ్: ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసినందుకు గురువారం నారాయణఖేడ్‌లో ఆర్యవైశ్య సంఘం, లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా అభినందన సమావేశాలను ఏర్పాటు చేశారు. ఆయా సమావేశాల్లో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ మాట్లాడారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల వారి సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని వారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నాడన్నారు. ఈ సందర్భంగా వారిని ఆయా సంఘాల సభ్యులు సన్మానించారు. ఆయా సమావేశాల్లో మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ ఛైర్మన్ దారం శంకర్, టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, సాగర్ షెట్కార్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మునిగాల మాణిక్‌ప్రభుగుప్తా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోటగిరి సతీష్, పట్టణ అధ్యక్షుడు దారం కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి రైతులు సహకరించాలి

● సంగారెడ్డి ఆర్డీవో వసంతకుమారి

హత్నూర, మార్చి 14: ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి రైతులు సహకరించాలని సంగారెడ్డి ఆర్డీవో వసంతకుమారి కోరారు. రీజినల్ రింగు రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులతో గురువారం హత్నూర రైతు వేదికలో సమావేశం నిర్వహించి, అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. ప్రైవేటుగా పెరిగిన ధరలకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని కొందరు, భూమికి బదులు ఇతర ప్రాంతంలో భూములు కేటాయించాలని కొందరు రైతులు కోరారు. కాగా ట్రిబుల్ ఆర్ వెంట సర్వీసు రోడ్డు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కాసాల, దేవులపల్లి, సికింద్లాపూర్, దౌల్తాబాద్ గ్రామాల రైతులతో పాటు తహసీల్దార్ ఫర్వీన్ షేక్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

నారాయణఖేడ్, మార్చి 14: అంబేడ్కర్ జయంతిని ప్రతీ గ్రామంలో ప్రభుత్వపరంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఖేడ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామా గ్రామాన వేడుకలతో పాటు అన్ని విద్యాసంస్థల్లో రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులివ్వాలని కోరారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్, అంబేడ్కర్ సంఘం ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు కాన్షీరాం, ఆయా సంఘాల జిల్లా, స్థానిక నాయకులు మోశప్ప, చంద్రశేఖర్, అరుణ్, నర్సింహులు, సంజీవ్, తుకారం, అంబోజీ, గౌతం, మారుతి, సురేష్, రాజు, రాజేష్, ఓంకార్, శివానంద్ పాల్గొన్నారు.

మహానీయుల జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

సంగారెడ్డి రూరల్: మహానీయుల జయంతి ఉత్సవాలను ఈ నెల 15నుంచి ఏప్రిల్ 30వరకు నిర్వహించనున్నట్లు ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ తెలిపారు. మహానీయులు జయంతి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాని ఆయన కోరారు.

కార్ల్ మార్క్స్‌కు సీపీఎం ఘన నివాళి

సంగారెడ్డి రూరల్, మార్చి 14: కార్ల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా గురువారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి సీపీఎం నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ మాట్లాడుతూ.. దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు పోరాడిన మహోన్నతుడు కార్ల్ మార్క్స్ అని అన్నారు. కార్మికవర్గాన్ని జాగృతం చేసి వజ్రాయుధంగా మారారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేశం, సాయిలు, మాణిక్యం, బాబురావు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడి మృతి



శివశంకర్(ఫైల్)

పాపన్నపేట, మార్చి 14: ప్రమాదవశాత్తు నీటమునిగి యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గాజులగూడెం గ్రామ కుంటలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ గ్రామానికి చెందిన దాసరి శివశంకర్(29) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 6న ఓ పని నిమిత్తం తన భార్య భాగ్యతో కలిసి అత్తగారి గ్రామమైన పాపన్నపేట మండల పరిధిలోని గాజులగూడెంకు వచ్చారు. అప్పటి నుంచి ఇక్కడే ఉన్నారు. గురువారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం శివశంకర్ గ్రామ కుంట వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి, మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో నేరస్థుడికి జీవిత ఖైదు

చిన్నశంకరంపేట, మార్చి 14: వృద్ధురాలి హత్యకేసులో నేరస్థుడికి కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.15 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ బాలస్వామి గురువారం వెల్లడించారు. చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామానికి చెందిన వడియారం ఎల్లమ్మను అదే గ్రామానికి చెందిన మ్యాకల సిద్ధిరాములు గతేడాది నగలు దోచుకుని, హత్య చేశాడు. ఎల్లమ్మ కుమారుడు నాగయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా సెషన్స్ న్యాయాధికారి లక్ష్మిశారద నేరస్థుడికి జీవిత ఖైదుతో పాటు రూ.15 వేల జరిమానా విధించారు.

బస్సును ఢీకొట్టిన లారీ.. నలుగురికి గాయాలు

రామాయంపేట, మార్చి 14: ట్రావెల్స్ బస్సును లారీ ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం రాత్రి జరిగింది. రామాయంపేటలో జరిగే శుభకార్యానికి హైదరాబాద్ నుంచి మినీ ట్రావెల్స్ బస్సులో కొందరు వస్తుండగా.. హైదరాబాద్-రామాయంపేట జంక్షన్ వద్ద బస్సును లారీ ఢీకొట్టింది. జంక్షన్ వద్ద మలుపుతున్న క్రమంలో వేగంగా వస్తున్న లారీ బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న నలుగురు గాయపడగా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం



హస్తాల్‌పూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రాజిరెడ్డి

వెల్దుర్తి, మార్చి 14: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని హస్తాల్‌పూర్, యశ్వంతరావుపేట గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, నాయకులు నిరంజన్‌రెడ్డి, పోతిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదీలీలు, పదోన్నతులు చేపట్టాలి

జహీరాబాద్, మార్చి 14: రెసిడెన్సియల్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకుడు శామయ్య కోరారు. గురువారం జహీరాబాద్ మండలంలోని ఆయా గురుకుల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. 317 జీవో ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు సొంతజిల్లాలకు పంపించాలని, పీఆర్సీలో అదనపు ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలని కోరారు. సమావేశాల్లో నాయకులు విఠల్, శ్యాంసుందర్, వెంకట్రావు పాల్గొన్నారు.

నేడు మెడికల్ కాలేజీలో ఇంటర్వ్యూలు

సంగారెడ్డి అర్బన్, మార్చి 14: సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో శుక్రవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుధామాధురి ప్రకటనలో తెలిపారు. మెడికల్ కాలేజీతో పాటు అనుబంధ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసేందుకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్స్, సీనియర్ రెసిడెంట్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల వరకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, దరఖాస్తులతో కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె కోరారు.

'పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి'

జహీరాబాద్, మార్చి 14: పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడి సూచించారు. గురువారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఏమైనా ఇబ్బందులుంటూ తమ దృష్టికి తేవాలని సూచించారు. పండుగలను అందరు కలిసి ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు మహ్మద్‌ఖాజామియ, గొల్ల భాస్కర్, కండెం నర్సింహులు, వెంకటేశం, గణేష్, జహంగీర్, అబ్దుల్లా, సీఐ రవి, పట్టణ ఎస్ఐ లక్ష్మారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

బేటీ పడావో-బేటీ బాచావోపై అవగాహన

మనోహరాబాద్, మార్చి 14: మనోహరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో బేటీ పడావో-బేటీ బాచావో కార్యక్రమంపై గురువారం మహిళా జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మహిళలకు లైఫ్ స్కిల్స్, మెంటల్ హెల్త్ ట్రైనింగ్ కార్యక్రమంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిత కేంద్రం, జెండర్ స్పెషలిస్ట్ కవిత, నాగమణి, ఫైనాన్షియల్ లిటరేస్ రమేష్, టీచర్ కోరపాటి సునీత పాల్గొన్నారు.

గుమ్మడిదలలో మహిళా దినోత్సవం

గుమ్మడిదల, మార్చి 14: గుమ్మడిదల రైతు వేదికలో ఎమ్మెల్యే సతీమణి యాదమ్మతో కలిసి ఎంపీపీ సద్ది ప్రవీణాభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమారాణి ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవం నిర్వహించారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న మహిళా సిబ్బందిని సన్మానించారు. అలాగే వెలుగు సమాఖ్య భవనంలో వేడుకలు నిర్వహించారు.

జహీరాబాద్ పట్టణ బీజేపీ కార్యవర్గం ఎన్నిక

జహీరాబాద్, మార్చి 14: జహీరాబాద్ పట్టణ బీజేపీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పట్టణ అధ్యక్షుడు మఠం విశ్వనాథ్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా అప్పం శ్రవణ్‌కుమార్, కృష్ణకాంత్, నీలేష్, అర్చనాసారడా, ప్రధాన కార్యదర్శులుగా పాలికర్ సంతోష్, బొగ్గుల సంతోష్, కార్యదర్శులుగా శివపూజ శ్రీకాంత్, దుర్గేష్, ఈష్టీ చంద్రశేఖర్, మన్సూర్, కోశాధికారిగా చంద్రశేఖర్, అధికార ప్రతినిధిగా మటపతి వీరేష్ లను ఎన్నుకున్నట్లు వివరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం, మార్చి 14: జిన్నారంలో శివాలయ నిర్మాణానికి రూ.2లక్షల51వేలను గురువారం అరుణ, రవీందర్ విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బోజిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఫణిగుప్తా, శ్రీనివాస్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, శంకరయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

టేక్మాల్ ఎస్ఐగా మురళి

టేక్మాల్, మార్చి 14: టేక్మాల్ నూతన ఎస్ఐగా మురళి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన రమేష్‌కు సీఐగా ప్రమోషన్ రావడంతో బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మురళి వచ్చారు.

ఇందిరకు ఉమెన్ అచీవర్స్ అవార్డు

నారాయణఖేడ్, మార్చి 14: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో ప్రకటించిన ఉమెన్ అచీవర్స్ అవార్డు-2024కు మండల పరిధిలోని లింగాపూర్ అంగన్‌వాడీ-2 టీచర్ జట్ల ఇందిర ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ రీజినల్ డైరెక్టర్ మోతి అవార్డును అందజేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మునిపల్లి, మార్చి 14: ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు మునిపల్లిలో గురువారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సతీష్, ఎంపీటీసీలు పాండు, రాధాబాయి, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, నాయకులు నర్సింహగౌడ్, రుద్రక్రిష్ణ, సంగన్న, రేగోటి నరేష్, వీరన్న పటేల్, మల్లికార్జునపల్లి దిడ్డి పాండు, చిన్నచెల్మెడ శ్రీధర్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

టేక్మాల్, మార్చి 14: మండల కేంద్రమైన టేక్మాల్‌లో తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో గురువారం తహసీల్దార్ కృష్ణ హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ సాయిశ్రీకాంత్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా లాయర్ల గది ప్రారంభం

సంగారెడ్డి క్రైమ్, మార్చి 14: సంగారెడ్డి జిల్లా కోర్టులో మహిళా న్యాయవాదుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిని జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన పనులు షురూ

కొండాపూర్, మార్చి 14: తొగర్‌పల్లి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ భవన పనులను గ్రామ ప్రత్యేకాధికారి, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ గురువారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రభుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సమ్మ, మాజీ సర్పంచ్ మంజులాప్రభకర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సునీల్ పాల్గొన్నారు.

పొలంపల్లిలో విగ్రహావిష్కరణ

చేగుంట, మార్చి 14: పొలంపల్లికి చెందిన బీజేపీ కార్యకర్త సతీశ్‌గౌడ్ ఇటీవల మృతి చెందగా.. గ్రామంలో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆవిష్కరించారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, మార్చి 14: ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. సంగారెడ్డిలో 16,592 మందికి 16,113 మంది హాజరుకాగా, 479 మంది గైర్హాజరయ్యారు. 97.11 హాజరు శాతం నమోదైంది. పరీక్షల నిర్వహణకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ ధన్యవాదాలు తెలిపారు. మెదక్ జిల్లాలో 6,054 గాను 5,781 (95శాతం) మంది హాజరయ్యారు. 273 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు.

చాకరిమెట్ల ఆలయ కమిటీకి నోటిఫికేషన్

శివ్వంపేట, మార్చి 14: మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్తల కమిటీ ఏర్పాటుకు దేవాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తిగల వారు 20రోజుల్లోగా సంగారెడ్డిలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు,

అధికారుల ఫిర్యాదుపై పోలీసుల నిర్లక్ష్యం

హత్నూర, మార్చి 14: మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో గల అయ్యమ్మ చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ ఏఈ భూపుత్ర ఈ నెల 2న హత్నూర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటి వరకు పోలీసులు ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇరిగేషన్ ఏఈ ఫిర్యాదు చేసిన విషయం నిజమేనని ఎస్ఐ సుభాష్ తెలిపారు. కానీ ఫిర్యాదుతో పాటు పూర్తిస్థాయి రికార్డులు పొందుపర్చకపోవడం వల్లే కేసు నమోదు చేయలేదని ఎస్ఐ చెప్పడం విశేషం.

కుంట ఆక్రమణను పట్టించుకోని అధికారులు

శివ్వంపేట: మండలంలోని శభాష్‌పల్లి పరిధిలోని అంసానికుంటలోకి వర్షపు నీరు వచ్చే కాలువను ఆక్రమించి నిర్మాణం చేపట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రైతులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కలెక్టరేట్‌తో పాటు నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నారాయణఖేడ్, మార్చి 14: నారాయణఖేడ్ పట్టణంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు గురువారం జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో పోతన్‌పల్లి, తుర్కవడగాం, నారాయణఖేడ్, పట్టణానికి చెందిన నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాహెర్‌అలీ పాల్గొన్నారు.

పంటలసాగుపై అవగాహన



రంజోల్‌లో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్, మార్చి 14: పంటలసాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏరువాక శాస్త్రవేత్త సరిత, ఏఈవో ప్రదీప్ పేర్కొన్నారు. గురువారం రంజోల్ గ్రామంలో రైతులు సాగుచేసిన వివిధరకాల పంటలను పరిశీలించి, అవగాహన కల్పించారు. అధికారులు సూచించిన విత్తనాలను, ఎరువులను, పిచికారి మందులను తప్పకుండా వాడాలని సూచించారు. వేసవికాలంలో పుచ్చకాయ పంటకు డిమాండ్ ఉంటుందని, ఐఎఎస్ బెంగళూరు వారు రూపొందించిన ఆరకాశమరకం విత్తనాన్ని సాగుచేస్తే దిగుబడి ఎక్కువగా వస్తుందని వెల్లడించారు.

సీసీ కెమెరాల ప్రారంభం

మనోహరాబాద్, మార్చి 14: మనోహరాబాద్ మండల కేంద్రంలో దండుపల్లి ఐటీసీ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను ఎస్పీ బాలస్వామి గురువారం ప్రారంభించారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని ఎస్పీ పేర్కొన్నారు. అంతకు ముందు పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణ, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, నాయకులు వెంకటేష్‌గౌడ్, జావీద్‌పాషా, గోవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కలిసి పని చేసి ప్రజా సమస్యలను పరిష్కరిద్దాం

● కొల్చారం మండల సర్వసభ్య సమావేశంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం, మార్చి 14: కలిసి పని చేసి ప్రజా సమస్యలను పరిష్కరిద్దామని అధికారులు, ప్రజాప్రతినిధులతో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం ఎంపీపీ కొరబోయిన మంజుల అధ్యక్షతన నిర్వహించిన కొల్చారం మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రతీ గ్రామంలో అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. దుంపలకుంట నుంచి సంగాయిపేట వరకు ప్రత్యేక పైప్‌లైన్ వేసి తాగునీటి సమస్య పరిష్కారమయ్యేలా ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్డు పనులను చేపట్టాలని సూచించారు. రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ మహ్మద్ గఫార్‌మియా, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు, ఎంఈవో నీలకంఠం, ఎంపీటీసీలు ఉదయవేమారెడ్డి, ఎల్లయ్య, సొసైటీ చైర్మన్లు మల్లేశంగౌడ్, మనోహర్, ఆయా శాఖల అధికారులు మహిపాల్‌రెడ్డి, సుసిల్వ, హైమద్, ఇర్ఫాన్ హుస్సేన్, శ్వేతకుమారి, లక్ష్మినర్సమ్మ, శ్రీకాంత్, మహేష్ కుమార్, డాక్టర్ హర్షిత పాల్గొన్నారు.

పీఆర్ ఏఈపై చర్యలు తీసుకోండి

● మండల సమావేశంలో సభ్యుల డిమాండ్, తీర్మానం

మునిపల్లి, మార్చి 14: మునిపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శైలజ అధ్యతక్షతన గురువారం నిర్వహించారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభం కావల్సిన సమావేశం మధ్యాహ్నం 12గంటలకు ప్రారంభమై సమస్యలపై చర్చించకుండానే గంటలోపే ముగిసింది. ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక, వ్యవసాయ శాఖల అధికారులు ఎజెండాలోని అంశాలను చదివి వినిపించారు. కాగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి పీఆర్ ఏఈ మధుకర్ తమకు సమాచారం ఇవ్వడం లేదని, జడ్పీటీసీ పైతర మీనాక్షి, ఎంపీపీ శైలజ, సభ్యులు రాజశేఖర్, రేణుక, స్వప్న, లక్ష్మీ, కో ఆప్షన్ సభ్యుడు సలావుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈ మధుకర్ వచ్చేంత వరకు సమావేశం నిర్వహించవద్దని నిరసన తెలిపారు. ఎంపీడీవో పీఆర్ ఏఈకి ఫోన్ చేయగా ఆరోగ్యం బాగాలేదని సమాధానం చెప్పారు. పీఆర్ ఏఈపై చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరడంతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు ఎంపీడీవో ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్పందించిన అదనపు కలెక్టర్ పీఆర్ ఏఈకి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో హరినందన్‌రావు, అధికారులు సంతోష్‌కుమార్, శివకుమార్, దశరథ్, అంగద్ కుమార్, శైలజ, ఎంపీటీసీలు పాండు, విజయ, శివలీల, రాధాబాయి పాల్గొన్నారు.



పీఆర్ ఏఈపై చర్యలు తీసుకోవాలని తీర్మానించిన ప్రతిని ఎంపీడీవోకు అందజేస్తున్న సభ్యులు

నీలం మధు జన్మదిన వేడుకలు



కౌడిపల్లిలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

చిన్నశంకరంపేట/కౌడిపల్లి, మార్చి 14: కాంగ్రెస్ నేత నీలం మధు జన్మదిన వేడుకలను చిన్నశంకరంపేటలో ముదిరాజ్ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు అరుణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు రమేష్, మాజీ సర్పంచ్ పోచయ్య, ముదిరాజ్ సంఘం సోదరులు మేడి శ్రీమాన్, నాగేష్, సుధాకర్, యాదగిరి, కాంగ్రెస్ నాయకులు రమేష్‌గౌడ్, సత్యంగౌడ్ పాల్గొన్నారు. కౌడిపల్లి మండలంలో నీలం మధు జన్మదిన వేడుకలు ఎన్ఎంఆర్ యువసేన నాయకులు పాం శేఖర్, బుజరంపేట్ మల్లేశం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్లస్టర్ హెల్త్ సెంటర్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్సింహులు, నరహరి, తాటి అంజనేయులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి లబ్ధిదారుల నిరసన

కోహీర్, మార్చి 14: గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్లకు జీరో బిల్లు రావడంలేదని గురువారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులు కోహీర్‌లోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గృహజ్యోతి రాని లబ్ధిదారులు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపిన అధికారులు కార్యాలయానికి వస్తే తమ వద్ద దరఖాస్తులను తీసుకోవడం లేదని పేర్కొన్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబాకు కూడా లబ్ధిదారులు విన్నవించినా వేరే సమావేశం నిమిత్తం వచ్చానని దాటవేస్తూ వెళ్లడం గమనార్హం. అనంతరం సూపరింటెండెంట్ రఘు కంప్యూటర్ ఆపరేటర్లను పిలిపించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకొని అప్‌డేట్ చేయించడంతో లబ్ధిదారులు శాంతించారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం: డీఎస్పీ

మెదక్ అర్బన్, మార్చి 14: కరాటే ఆత్మరక్షణకు దోహదపడుతుందని మెదక్ డీఎస్పీ రాజేష్ పేర్కొన్నారు. గురువారం వెంకట్రావ్‌నగర్‌లోని సిద్ధార్థ విద్యా సంస్థల్లో నిర్వహించిన షైక్వాండో కరాటే పోటీలను ఆయన ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్‌చౌదరితో కలిసి బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంధ్యారాణి, గ్రాండ్ మాస్టర్ ప్రవీణ్‌కుమార్, సెక్రటరీ కృష్ణ, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీసాయి విద్యాలయ వార్షికోత్సవం



చిన్నారుల నృత్య ప్రదర్శన

కల్హేర్, మార్చి 14: కల్హేర్‌లోని శ్రీసాయి విద్యాలయ 28వ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పండరిగౌడ్, పాఠశాల చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ శెట్టి మల్లికార్జున్, ఉపాధ్యాయులు పండరి, సంతోష్‌రెడ్డి, దత్తురెడ్డి, సందీప్‌గౌడ్, అనిత, శ్వేత, వీణ, అనురాధా, నిరోష, సుఖవాణి పాల్గొన్నారు.

నేడు సాహితి ఆస్పత్రిలో వైద్య శిబిరం

సంగారెడ్డి అర్బన్, మార్చి 14: సంగారెడ్డి రైతు బజార్ ఎదరుగా ఉన్న సాహితి ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత న్యూరో, డయాబెటిక్ హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి అధినేత సాహితీరాము తెలిపారు. ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు క్యాంపు కొనసాగుతుందని పేర్కొన్నారు. నరాలకు సంబంధించిన సమస్యలు, పక్షవాతం, మూతి వంకర, నడక తదితర సమస్యలతో బాధపడతున్న వారు, బీపీ, షుగర్, థైరాయిడ్, శ్వాసకోశ వ్యాధుల సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్య సేవలందించనున్నట్లు తెలిపారు.

గురుకులంలో తాగునీటి కరువు

● బోరుబావుల వద్ద తెచ్చుకుంటున్న విద్యార్థులు

కౌడిపల్లి, మార్చి 14: మండల క్రేంద్రంలోని గిరిజన గురుకులంలో తాగునీటి కొరత విద్యార్థులను వేధిస్తున్నది. పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 480 మంది విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో నీళ్లు లేకపోవడంతో గురువారం వ్యవసాయ బోర్ల వద్దకు విద్యార్థులు నీళ్ల డబ్బాలతో వెళ్లడం కనిపించింది. గత కొంత కాలంగా పాఠశాలలో తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నా హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదు.



నీళ్లడబ్బాలతో బావుల వద్దకు వెళ్తున్న విద్యార్థులు

సదాశివపేట బల్దియా బడ్జెట్ రూ.70.03కోట్లు

● ఆమోదం తెలిపిన కౌన్సిలర్లు

సదాశివపేట, మార్చి 14: సదాశివపేట మున్సిపాలిటీ 2024-25 వార్షిక బడ్జెట్ సమావేశం గురువారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అపర్ణపాటిల్ అధ్యక్షతన నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలు, 2023-24 ఆర్థిక సంవత్సరపు సవరించిన బడ్జెట్ అంచనాల వివరాలను కమిషనర్ ఉమ కౌన్సిలర్లకు చదివి వినిపించారు. సదాశివపేట మున్సిపల్ బడ్జెట్ రూ.70.03కోట్లుగా అధికారులు అంచనా వేయగా 22మంది మెజార్టీ కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల అభివృద్ధి కోసం చట్టం ప్రకారం కేటాయింపులు జరిపినట్లు తెలిపారు.



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

తూప్రాన్ బడ్జెట్ రూ.16.79కోట్లు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఇన్‌చార్జి చైర్మన్ శ్రీనివాస్

తూప్రాన్: తూప్రాన్ మున్సిపల్ బడ్జెట్ సమావేశం ఇన్‌చార్జి చైర్మన్ నందాల శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వ్యయం రూ.16.79కోట్లుగా అంచనా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు మామిండ్ల జ్యోతికృష్ణ, చెలిమెల ప్రియాంక, పల్లెర్ల జ్యోతిరవీందర్‌గుప్తా, జిన్న భగవాన్‌రెడ్డి, బాణాపురం రాజు, చింత రవీందర్‌రెడ్డి, జమాల్‌పూర్ లక్ష్మీబాయి నర్సోజీ, రామునిగారి శ్రీశైలంగౌడ్, కొడిప్యాక నారాయణగుప్తా పాల్గొన్నారు. కాగా తూప్రాన్ పట్టణ ప్రజలకు మిషన్ భగీరథ నల్లా బిల్లులు తొలగిస్తూ తీర్మానం చేసినట్లు చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. అలాగే పలు అభివృద్ధి పనులకు కూడా తీర్మానం చేసినట్లు కమిషనర్ తెలిపారు.